సాక్షి ఒడిశా
బుధవారం ၊ 5 ၊ మార్చి ၊ 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,81,011లు, బంగారం 1.650 గ్రాములు, వెండి 53.500 గ్రాములు వచ్చాయి.



భూములు ఇవ్వలేం

విమానాశ్రయానికి భూములు ఇవ్వలేమని సొరగుడ వాసులు తెలిపారు. అక్కడ ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. - 8లో



టిబెటియన్ శరణార్థుల వేడుకల ఆహ్వాన ద్వారం

న్యూస్‌రీల్

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ



నారాయణరావును పరామర్శించిన ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు కుటుంబ సభ్యురాలు రమణమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి కాశీనగర్ సమితి ఇస్తల గ్రామంలోని నారాయణరావు ఇంటికి మంగళవారం వెళ్లి పరామర్శించి సంతాపం తెలియజేశారు. రమణమ్మ మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు.

పంచాయతీ రాజ్ దినోత్సవం తేదీ మార్పు

- ఏప్రిల్ 24న పంచాయతీ రాజ్ దినోత్సవం
- నేడు బిజూ పట్నాయక్ జయంతి



భువనేశ్వర్: ఏప్రిల్ 24న జరిగే జాతీయ ఉత్సవానికి అనుగుణంగా రాష్ట్రంలో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని జరుపుకునే తేదీని మారుస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యమంత్రి కార్యాలయం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. గతంలో రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ జయంతి సందర్భంగా ఏటా మార్చి 5న జరుపుకునే పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఇక నుంచి ఏటా ఏప్రిల్ 24న జరుపుకుంటారు. రాష్ట్ర స్థాయి పంచాయతీ రాజ్ దినోత్సవం వేడుకల మధ్య వైరుధ్యం పరిష్కరించడం లక్ష్యంగా ఈ మార్పు చేపట్టినట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. ఏటా మార్చి 5వ తేదీని రాష్ట్రానికి చెందిన రాజనీతిజ్ఞుడు బిజు పట్నాయక్ జయంతిగా మాత్రమే జరుపుకుంటామని ముఖ్యమంత్రి ధ్రువీకరించారు. గతంలో మాదిరిగా ఈ తేదీని ప్రభుత్వ సెలవు దినంగా పాటించరని స్పష్టం చేశారు. తాజా నిర్ణయం ప్రకారం ఏప్రిల్ 24న ప్రజా సేవా దినోత్సవంతో పాటు పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని జరుపుకుంటామని ప్రకటన పేర్కొంది.

జాతీయ గుర్తింపు, అవార్డులు

ఏప్రిల్ 24న జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం జరుపుకుంటారు. ఈ సందర్భంగా జరిగే జాతీయ ఉత్సవంలో రాష్ట్రాలలోని వివిధ పంచాయతీ ప్రతినిధుల ఆదర్శప్రాయమైన పనిని గుర్తించి జాతీయ గాంప్ సభ అవార్డులు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అవార్డులు వంటి బహుళ అవార్డులను ప్రదానం చేస్తారు.

160 కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎక్సైజ్ సిబ్బంది

బరంపురం: పంట పొలాల్లో రహస్యంగా గంజాయిని తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నామని ఎక్సైజ్ డిప్యూటీ సూపరింటిండెంట్ శ్రీకాంత్ రౌత్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉక్నాక్ పట్టణలోని కనీష-సింహళ రహదారిలో గంజాయి రవాణా జరుగుతుందన్న పక్కా సమాచారంతో మంగళవారం అబ్కారీ అధికారులు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశామన్నారు. వీరివద్ద నుంచి 160 కేజీల గంజాయితో పాటు మూడు కార్లు, పది సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గజపతి జిల్లాకు చెందిన నలుగురు, మహారాష్ట్ర జిల్లాకు చెందిన ముగ్గురు వ్యక్తులు గంజాయిని ఇన్నోవ కారులో మహారాష్ట్ర తరలించేందుకు ఒక కారు నుంచి మరో కారులోకి ఎగుమతి చేస్తుండగా పట్టుబడ్డారన్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.50 లక్షల వరకు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఘనంగా డైమండ్ జూబ్లీ వేడుకలు



చంద్రగిరి వద్ద టిబెటియన్ విద్యార్థులు



చంద్రగిరిలో టిబెటియన్ శరణార్థుల డైమండ్ జూబ్లీ వేడుకల్లో ప్రసంగిస్తున్న డ్రోంగ్‌భో ఖెంపో టెంఫెల్



టిబెటియన్ శరణార్థుల డైమండ్ జూబ్లీ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహన బ్లాక్ చంద్రగిరిలో టిబెటియన్ సెటిల్‌మెంట్ డైమండ్ జూబ్లీ వేడుకలు (1963–2024) అంగరంగ వైభవంగా జరిగాయి. రెండు రోజుల పాటు జరిగిన టిబెటియన్ శరణార్థుల వేడుకలు మంగళవారంతో ముగిశాయి. ఈ వేడుకలకు బరంపురం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ కల్యాణి సంఘమిత్ర దేవ్, పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, మోహన ఎమ్మెల్యే దాశరథి గోమాంగో, దేవీ మఠం పీఠాధిపతి రామానంద్ దాస్, టిబెటియన్ శరణార్థుల హెడ్ క్వార్టర్స్, ధర్మశాల నుంచి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. మంగళవారం సాయంత్రం టిబెటియన్ మహిళలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహుతులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమాలు జిరంగో టిబెటియన్ బౌద్ధ అధికారి డ్రోంగ్‌భో ఖెంపో టెంఫల్ ఆధ్వర్యంలో నిర్వహించారు.



టిబెటియన్ శరణార్థుల వేడుకల్లో మాట్లాడుతున్న గ్రామతరంగ్ సీఈఓ



టిబెటియన్ ధర్మశాల నుంచి విచ్చేసిన అధికారులు

విద్యుత్ శాఖ కార్యకలాపాలపై సమీక్ష



ముఖ్యమంత్రి అధ్యక్షతన విద్యుత్ శాఖ కార్యకలాపాల సమీక్ష సమావేశం

భువనేశ్వర్: రానున్న వేసవిలో విద్యుత్ నిరంతర సరఫరా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆదేశించారు. వేసవి కాలంలో విద్యుత్ శాఖ కార్యకలాపాల సన్నద్ధతని ఆయన సమీక్షించారు. ఈ సమావేశానికి విద్యుత్ విభాగం ఉన్నతాధికారులతో అనుబంధ శాఖలు, భాగస్వామ్య సంస్థల అధికారుల హాజరయ్యారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజనలో రాష్ట్రంలో అత్యధికుల్ని చేర్చడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వేసవిలో సాధారణం కంటే అధికంగా విద్యుత్ వినియోగంతో ఓవర్‌లోడింగ్ సమస్య తలెత్తుతుంది. ఈ సమస్య అధిగమించడానికి ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లను అప్‌గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. విద్యుత్ సరఫరా విభాగంలో బలమైన బ్యాకప్ వ్యవస్థను కలిగి ఉండాలని ఆదేశించారు. పీక్ అవర్ డిమాండ్‌కు అనుగుణంగా వివిధ విద్యుత్ ఉత్పత్తి సంస్థలతో సంప్రదించి రాష్ట్రంలో తగినంత విద్యుత్ అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి సూచించారు. దీంతో పాటు రాష్ట్రంలో పనిచేస్తున్న అన్ని విద్యుత్ పంపిణీ సంస్థలను ఎండ సమయంలో నిరంతర విద్యుత్ సరఫరాపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

వడగాడ్పులపై ముందస్తు సన్నాహాలు

- పాఠశాలలు, కళాశాలలకు ప్రత్యేక మార్గదర్శకాలు



వడగాడ్పుల సన్నద్ధత సమావేశంలో బీఎంసీ కమిషనరు ప్రసంగం



బీఎంసీ వడగాడ్పుల సన్నద్ధత సమావేశంలో పాల్గొన్న అనుబంధ శాఖల అధికారులు

భువనేశ్వర్: ఈ ఏడాది వేసవి తీవ్రత విపరీతంగా ఉంటుందని వాతావరణ శాఖ ముందుగా సంకేతాలు జారీ చేసింది. ఈ నెల నుంచే వేసవి తాపం పుంజుకుంటుంది. ఈ నేపథ్యంలో వడగాడ్పుల తీవ్రత నివారణకు ముందస్తు జాగ్రత్త చర్యలతో సన్నద్ధం అవుతున్నట్లు మంత్రి సురేష్ కుమార్ పూజారి తెలిపారు. ప్రధానంగా పాఠశాలలు, కళాశాల విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా ప్రత్యేక నియమావళి జారీ చేయనున్నారు. త్వరలో ఉదయం పూట తరగతులతో ఒంటి పూట బడులు నిర్వహించనున్నారు. ఈ మార్గదర్శకాలను ఖరారు చేయడానికి పాఠశాల, సామూహిక విద్యా శాఖ, ఉన్నత విద్యా శాఖ, ఇతర విభాగాల అధికారులు చర్చలు జరుపుతున్నారని రెవెన్యూ మంత్రి సురేష్ కుమార్ పూజారి తెలిపారు.

- మార్చి, ఏప్రిల్, మేలో వరుసగా 3 నెలల్లో రాష్ట్రంలో అత్యధిక ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత సాధారణం కంటే ఎక్కువగా ఉండవచ్చు.
- పశ్చిమ ఒడిశాలో ముఖ్యంగా బొలంగీర్, బర్‌గఢ్, నువాపడా, ఝార్సుగుడ, సుందర్‌గఢ్‌లలో వేడి తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఐఎండి తెలిపింది.

బీఎంసీ సన్నద్ధత

స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీ కమిషనర్ అధ్యక్షతన వడగాడ్పుల నిర్వహణ పరిస్థితిపై సన్నాహక సమావేశం జరిగింది. నగరంలో నిరంతర తాగు నీరు, విద్యుత్ సరఫరా, వీధుల్లో పశువులు, జంతువుల కోసం తాగునీటి ఏర్పాట్లు, ఆరోగ్య సముదాయాల్లో వడ దెబ్బ చికిత్స సదుపాయాల వద్ద సన్నద్ధత అంశాలపై చర్చించారు. మరో వైపు వడగాడ్పుల పట్ల సాధారణ ప్రజలకు అవగాహన పెంపొందించి అవాంఛనీయ సంఘటనల నిర్వహణలో అనుబంధ విభాగాలు, శాఖల మధ్య చక్కని సమన్వయం అవసరమని తెలిపారు. నిర్మాణ, పారిశుద్ధ్య ఇతరేతర కార్మికుల పని వేళల సర్దుబాటు ఎండ తీవ్రత నుంచి రక్షణ కల్పించడం అనివార్యంగా పేర్కొన్నారు.

పెద్దలు అంగీకరించలేదని..

ప్రేమజంట ఆత్మహత్య

- కొటాలి గ్రామంలో విషాదం



చెట్టుకొమ్మకు వేలాడుతున్న ప్రేమికుల మృతదేహాలు



దాయిమతి జొడియా, భరత్ సాహు (ఫైల్)

రాయగడ: వారిద్దరూ మూడేళ్లుగా గాఢంగా ప్రేమించుకుంటున్నారు. ఒకరంటే మరొకరికి ఎంతో ఇష్టం. పెళ్లి చేసుకోవాలి అనుకున్నారు. అయితే ఇరుకుటుంబాల పెద్దలు అంగీకరించలేదు. దీంతో కలిసి జీవించకపోయినా కలిసి చనిపోవాలని అనుకున్నారు. మామిడిచెట్టు కొమ్మకు ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నారు. ఈ విషాద ఘటన రాయగడ జిల్లాలోని కాసీపూర్ సమితి మైకంచ్ పంచాయతీ పరిధి కొటాలి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఆత్మహత్యకు పాల్పడింది అదే గ్రామానికి చెందిన దాయిమతి జొడియా (20), భరత్ సాహు(20)లుగా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొటాలి గ్రామంలో నివసిస్తున్న దాయిమతి జొడియా, భరత్ సాహు మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకోవాలని కలలుకన్నారు. అయితే వీరి ప్రేమ గురించి పెద్దలకు తెలియజేయడంతో పెళ్లికి ఇరు కుటుంబాల పెద్దలు అంగీకరించలేదు. దీంతో మనస్తాపానికి గురైన దాయిమతి జొడియా, భరత్ సాహు కొటాలి గ్రామానికి సమీపంలోని ఒక మామిడి చెట్టుకు ఉరి వేసుకుని బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారు. అటువైపుగా వెళ్లిన కొందరు చెట్టుకొమ్మకు వేలాడుతున్న మృతదేహాలను చూసి గ్రామస్తులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులకు విషయాన్ని తెలియజేశారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం టికిరి ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బిసంకటక్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- ముగ్గురి మృతి
- ఇద్దరికి గాయాలు
- బైక్ రేసింగే ప్రమాదానికి కారణం



సంఘటనా స్థలం వద్ద పడి ఉన్న మృతదేహాలు



యువకుని మృతదేహం

రాయగడ: బైకు రేసింగ్ సరదా ముగ్గురు ప్రాణాలను బలిగొంది. జిల్లాలోని బిసంకటక్ సమీపంలో ఉన్న భైరవ మందిరం వద్ద చోటు చేసుకున్న ఈ సంఘటనలో ముగ్గురు యువకులు మృతి చెందగా మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలంకు చేరుకుని మృతదేహాలను, క్షతగాత్రులను బిసంకటక్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తలిపిన వివరాల ప్రకారం.. పుటుగుడ గ్రామానికి చెందిన యువకులు జగన్నాథ మినియాక, మిన్నారావు భైరవ మందిరం సమీపంలో సోమవారం సాయంత్రం బైకు రేస్ చేస్తున్న సమయంలో బైకు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మరో బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో టిటిగుడ, రమానకుపులి గ్రామాలకు చెందిన కిరోద్ దుర్గా (23), పురుషోత్తం పత్రిక (24), సదానంద మండంగి (22)లు మృతి చెందగా.. జగన్నాథ మినియాక, మిన్నారావు అడంగిలు తీవ్రగాయాలపాలయ్యారు. ప్రమాదంలో రెండు బైకులు నుజ్జునుజ్జయ్యాయి. గాయపడిన వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం వారిని రాయగడ అనంతరం బరంపురం ఆస్పత్రికి రిఫర్ చేశారు.





నుజ్జునుజ్జయిన బైకులు

యువకుడి కిడ్నాప్

- తుపాకీ గురి పెట్టి యువకుడి అపహరణ
- రూ.25 లక్షలు డిమాండ్

జయపురం: జయపురం సమితి, ఉమ్మిరీ గ్రామ పంచాయతీ సొరగుడ గ్రామం అభిషిత్ సవుర అనే యువకుడిని తుపాకీతో బెదిరించి కిడ్నాప్ చేశారని, తమను రూ.20 లక్షలు చెల్లించాలని అడుగుతున్నారని బాధితుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సదర్ పోలీసు అధికారి సచీంద్ర ప్రధాన్ మంగళవారం వెల్లడించారు. పోలీసు అధికారి వివరణ ప్రకారం.. ఈ నెల 2 వ తేదీ సాయంత్రం అభిషిత్ అతడి స్నేహితుడు కలసి బహిర్భూమి కోసం సాయిమందిర సమీప ధన్‌పూర్ బ్రాంచ్ కెనాల్ కు వెళ్లారు. ఆ సమయంలో కొంతమంది దుండగులు ఒక కారులో వచ్చారు. వారు ముఖం కప్పుకుని ఉన్నారు. వారు తుపాకీ చూపి బెదిరించి అభిషిత్‌ను తీసుకెళ్లిపోయారు. వారు పేపరు మిల్లు మార్గం మీదుగా వెళ్లినట్లు గుర్తించారు. 3వ తేదీన దుండగులు అభిషిత్ ఇంటిలో ఒకరి ఫోనుకు ఫోను చేసి రూ.20 లక్షలు ఇవ్వాలని లేదంటే అభిషిత్‌ను చంపేస్తామని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. జయపురం సదర్ పోలీసు స్టేషన్ పరిధి గగణాపూర్ పోలీసు సంటి అధికారి సబ్‌ఇన్‌స్పెక్టర్ రాజ కిశోర్ బారిక్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

రాయగడ: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని జిల్లా అదనపు కలెక్టర్ నవీన్ చంద్ర నాయక్ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరం ప్రాంగణంలో మహిళలకు వివిధ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు ప్రయత్నం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ముగ్గులు, కబడ్డీ, ఖో–ఖో, చిత్రలేఖనం తదితర పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ మధుస్మిత, అసిస్టెంట్ కలెక్టర్ బిచిత్ర శెఠి తదితరులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



కబడ్డీ పోటీల్లో మహిళలు

కొరాపుట్ పంటలకు ప్రత్యేక గుర్తింపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



ఉత్తమ రైతుకు మొమెంటో అందజేస్తున్న దృశ్యం

జయపురం: కొరాపుట్ రైతులు పండించే పంటలకు ప్రత్యేక గుర్తింపు ఉందని జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి అన్నారు. స్థానిక దసరాపాడియ మైదానంలో నిర్వహిస్తున్న కృషి యంత్ర మేళ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు అన్ని రకాల పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ప్రభుత్వం సైతం రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. రైతులు వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించేందుకు యంత్రాల వినియోగం అవసరమని పేర్కొన్నారు. నవరంగపూర్ జిల్లా వ్యవసాయ విభాగ విశ్రాంత అధికారి జి.వెంకట రెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక ప్రణాళికతో మొక్కజొన్న పంట సాగును రైతులకు వివరించారు. అనంతరం ఉత్తమ రైతులను సన్మానించారు. జిల్లా వ్యవసాయ అధికారి గోకుల చంద్ర ప్రధాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కృషి యంత్ర విభాగ అధికారి సంతోష్ కుమార్ మిశ్ర, నందపూర్ వ్యవసాయ అధికారి ఎస్.ప్రకాశరావు, ఎస్పీ రోహిత్ వర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ మేళాలో దాదాపు రూ.5.3 కోట్ల యంత్రాలు అమ్ముడైనట్లు అధికారులు వెల్లడించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



అంబులెన్సులో క్షతగాత్రుడు

మెళియాపుట్టి: మండలంలోని పట్టుపురం గ్రామానికి చెందిన పతివాడ మురళి మంగళవారం జాడుపల్లి గ్రామానికి వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా బురద రామచంద్రాపురం వద్ద అదుపు తప్పి పడిపోయాడు. తీవ్రంగా గాయపడటంతో స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. సిబ్బంది వెంటనే చేరుకుని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు.

అంధత్వ నివారణే లక్ష్యం



కంటి వైద్యులతో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ

అరసవల్లి: జిల్లాలో అంధత్వ నివారణ లక్ష్యంగా ప్రతి ఒక్క కంటి వైద్యుడూ పనిచేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బాల మురళీకృష్ణ సూచించారు. మంగళవారం తన చాంబర్‌లో కంటి వైద్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా నిర్వహిస్తున్న కాటరాక్ట్ శిబిరాలను సందర్శించి బాధితులను గుర్తించి జిల్లా కేంద్రానికి రిఫరల్ చేయాలన్నారు. ప్రతి నెలా అడ్వాన్స్‌డ్ టూర్ ప్రోగాం ప్రకారం ప్రతిరోజూ ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం బడిపిల్లలకు కళ్లద్దాలను సకాలంలో అందజేసినందుకు ఆప్తాలమిక్ అధికారులను అభినందించారు. సమావేశంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం అధికారి డాక్టర్ త్రినాథరావు, డిప్యూటి పారా మెడికల్ అధికారి వాన సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

8న పీఓడబ్ల్యూ సంస్థల విలీన సభ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

పలాస: ఒంగోలులో ఈ నెల 8న జరగనున్న పీఓడబ్ల్యూ(ప్రగతి శీల మహిళా సంఘం) సంస్థల విలీన సభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు పలాస మండలం మాకన్నపల్లిలో మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థల జిల్లా అధ్యక్షులు ఎస్.కృష్ణవేణి, బి.ఈశ్వరమ్మలు మాట్లాడుతూ భావసారూప్యత కలిగిన అన్ని మహిళా సంఘాలు ఒకే వేదికపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కార్యదర్శి పోతనపల్లి కుసుమ మాట్లాడుతూ మహిళా హక్కుల సాధనకు సంఘటిత పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కుత్తుం హేమక్క, బర్ల జానకి, సైని కళావతి, బత్తిన ఉమ, బత్తిన సాయమ్మ, వెంకటమ్మ, పూర్ణావతి, ధనలక్ష్మి, మోహిని తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల విజేతగా 'జెస్సీ'



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

పలాస: మండలంలోని బొడ్డపాడు యువజన సంఘం 71వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జెస్సీ(బొడ్డపాడు) జట్టు విజేతగా నిలిచింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 30 జట్లు పాల్గొన్న ఈ టోర్నీ మూడ రోజులుగా ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో జరుగుతున్న సంగతి తెలిసిందే. ఉత్కంఠగా సాగిన ఫైనల్ పోటీల్లో బాహడపల్లి జట్టుపై జెస్సీ జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.40వేలు నగదు, షీల్డ్‌ను బొడ్డపాడు యువజన సంఘం అధ్యక్షుడు తామాడ క్రాంతి చేతుల మీదుగా అందజేశారు. రన్నరప్‌కు రూ.30వేలు, షీల్డు, తృతీయ స్థానంలో నిలిచిన వైజాగ్ వారియర్స్‌కు రూ.20వేలు నగదు, నాలుగో స్థానంలో నిలిచిన విజయనగరం జట్టుకు రూ.10వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జైభీమ్ యువజన సంఘం అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, కరగాన సుధా, కరగాన కుమార్, బొడ్డు జగన్, రెయ్యి మోహనరావు, బొడ్డు శ్రీనివాస్, రాజాం శ్రీనివాస్, గర్తం తులసీరావు, పోతనపల్లి గణపతి, బుడత బాలరాజు, కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రాపాక అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయానికి భూములు ఇవ్వలేం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బాలాజీ బ్రహ్మ

- స్పష్టం చేసిన సారగుడ గ్రామస్తులు

జయపురం: జయపురం విమానాశ్రయం విస్తరణ నిమిత్తం భూసేకరణ కోసం జయపురం సమితి ఉమ్మిరి పంచాయతీ సారగుడ ప్రాథమిక పాఠశాల ఆవరణలో అధికారులు మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. భూములు ఇచ్చేవారికి ప్రభుత్వ నియమం ప్రకారం నష్ట పరిహారం చెల్లిస్తామని అదనపు జిల్లా కలెక్టర్ బాలాజీ బ్రహ్మ ప్రజలకు హామీ ఇచ్చారు. దీనిపై అభిప్రాయం చెప్పాలని గ్రామస్తులను అధికారులు కోరారు. గతంలో విమానాశ్రయ విస్తరణ కోసం భూసేకరణ చేసినప్పుడు అధికారులు ఇచ్చిన హామీలు నేటి వరకు తీర్చలేదని ధ్వజమెత్తారు. మూడేళ్లు గడచినా ఎన్ని గ్రామ సభలలో ఈ విషయం ప్రస్తావించినా తమ భూములకు నష్టపరిహారం చెల్లించలేదని వారు ఆరోపించారు. తమకు రావలసిన పరిహారం కోసం కాళ్లు అరిగేలా తిరిగినా ఫలితం లేకపోయిందని దుయ్య బట్టారు. విమానాశ్రయ మార్గానికి రోడ్డు కోసం భూమి సేకరణ చేశారని.. అయితే ఇప్పటికీ పరిహారం ముట్ట లేదని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. భూములు ఇచ్చిన వారికి కనీసం విమానాశ్రయంలో చిన్న ఉద్యోగం కూడా ఇవ్వలేదని వారు నిందించారు. భూములు ఇచ్చిన వారికి పునరావాసం కల్పిస్తారన్న ఆశ ఉండేదని కాని నేడు కూలి పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంద ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములకు నష్టపరిహారంతో పాటు విమానాశ్రయంలో కనీసం నాలుగో శ్రేణి ఉద్యోగం ఇస్తామని లిఖిత పూర్వక హామీ ఇస్తే భూమి ఇస్తామని గ్రామస్తులు అధికారులకు స్పష్టం చేశారు. గ్రామ సభలో అదనపు కలెక్టర్‌తో పాటు జయపురం తహసీల్దార్ సవ్యసాయి జెన, జయపురం సమితి బీడీవో శక్తి మహాపాత్ర, సర్పంచ్ సబిత నాయిక్, పంచాయతీ కార్యనిర్వాహక అధికారి శ్రీనివాస పట్నాయక్, గ్రామ పెద్దలు దొయితారి సవుర, ఉపేంద్రనాయిక్, హరిబందు హరిజన్, ధనుర్జయ రౌణ, బాబుల రౌణ, ప్రతాప్ సవుర, సూర్య సవుర పాల్గొన్నారు.



గ్రామ సభలో పాల్గొన్న గ్రామస్తులు

స్వయం సహాయక గ్రూపులకు ఆర్థిక సాయం

జయపురం: బొయిపరిగుడ సమితిలో 79 స్వయం సహాయక మహిళా గ్రూపులకు రూ.3 కోట్ల 25 లక్షలు ఆర్థికసాయం అందజేశారు. కలెక్టర్ వి.కీర్తి వాసన్ సోమవారం బొయిపరిగుడలో సమితి కార్యాలయంలో నిర్వహించిన ప్రజాభియోగ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రజాభియోగ కార్యక్రమంలో 50 ఫిర్యాదులను స్వీకరించారు. వాటిలో 27 కమ్యూనిటీ ఫిర్యాదులు కాగా 23 వ్యక్తగత ఫిర్యాదులు. కార్యక్రమంలో ఎస్పీ రోహిత్ వర్మ, జిల్లా పరిషత్ ప్రధాన అభివృద్ధి అధికారి బేణుధర శబర, జయపురం సబ్ కలెక్టర్ కుమారి ఎ.శౌర్యా రెడ్డి, జిల్లా శిశు సురక్షా అధికారి రాజశ్రీ దాస్, బొయిపరిగుడ బీడీఓ అభిమన్య కవి శతపతి, జిల్లా పరిషత్ సభ్యులు రాజేష్ కుమార్ మహురియ, మణీ జాని, బొయిపరిగుడ సమితి అధ్యక్షుడు ప్రశాంత కుమార్ గుప్త, ఉపాధ్యక్షుడు పూర్ణమ బారిక్, తహసీల్దార్ స్నిగ్ధ చౌదురి, బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాళి ప్రధాన్, సమితి సామాజిక సురక్షా అధికారి కార్తీక చంద్ర పాఢీ, బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి సుకాంత కర్తామీ, జీపీడీఓ మిలు ప్రదాన్, సమితి వ్యవసాయ అధికారి నందు జానీ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత తప్పనిసరి

- ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

మెళియాపుట్టి : మల్టీపర్పజ్ సెంటర్ల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని సీతంపేట ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం మెళియాపుట్టి మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ఎర్రమానుగూడ, సవర చీడిపాలెం, నందల పాడు గ్రామాల్లో జరుగుతున్న మల్టీపర్పజ్ సెంటర్లను పరిశీలించి స్టీల్, సిమ్మెంట్, ఇటుకల నాణ్యతపై ఆరా తీశారు. పనుల్లో నాణ్యత పరిశీలించడానికి ప్రత్యేక బృందాలను పంపిస్తామన్నారు. భవనాలకు ఉన్న విద్యుత్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని పీఓ చెప్పారు. అనంతరం భరణికోట గిరిజన బాలికల సంక్షేమ ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, తరగతిగదులు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం కరజాడ పీహెచ్‌సీని సందర్శించి ఓపీ పరిశీలించారు. ఆయనతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సవర చీడిపాలెంలో మల్టీపర్పజ్ సెంటర్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి


యువతి ఆత్మహత్య

కవిటి: మండలంలోని సీహెచ్ కపాసుకుద్ది పంచాయతీ వడ్డిపుట్టుగకు చెందిన ఎలుసూరు సోనియా(25) అనే యువతి మంగళవారం సాయంత్రం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సోనియా మానసిక సమస్యలతో బాధపడుతోంది. కొన్నాళ్లుగా చికిత్సకూడా పొందుతోంది. ఇటీవలే ఆరోగ్యం కుదుటపడటంతో కుటుంబసభ్యులు పెళ్లి సంబంధం చూశారు. మే నెలలో వివాహానికి ముహూర్తం పెట్టుకున్నారు. ఇంతలో సోనియా ఆత్మహత్యకు పాల్పడడంతో విషాదఛాయలు అలముకున్నాయి. తండ్రి ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కవిటి ఎస్ఐ వి.రవివర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా ఉద్యోగులకు చట్టాలపై అవగాహన

శ్రీకాకుళం అర్బన్: ప్రతి మహిళా ఉద్యోగి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, వాటిని సామాన్య ప్రజలకు చేరువ చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. జిల్లాకేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులకు ప్రస్తుతం జరుగుతున్న నేరాలు, వాటికి విధిస్తున్న శిక్షలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సన్యాసినాయుడు మాట్లాడుతూ కొత్త చట్టాలను వివరించారు. ఐసీడీఎస్ పీవో బి.శాంతిశ్రీ మాట్లాడుతూ పలు చట్టాలను ఉదహరిస్తు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సమాజ సేవకులు హారికా ప్రసాద్, పీఓఐసీ మెట్ట మల్లేశ్వరరావు, విభిన్న ప్రతిభావంతుల ప్రాజెక్ట్ అధికారి కవితా, ఐసీడీఎస్ నోడల్ అధికారి మణెమ్మ, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ లక్ష్మి, పీఓఎస్ఐసీ లక్ష్మునాయుడు, పలువురు మహిళలు, బాలికలు పాల్గొన్నారు.

వైద్యారోగ్య శాఖలో.. వసూల్ రాజాలు!



జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి కార్యాలయం

- రంగంలోకి 'అధికారిక' దళారులు
- వారాంతంలో కీలక అధికారి చేతిలోకి వాటాలు
- ప్రతి పనికీ రేటు విధానంపై విమర్శలు

అరసవల్లి :

జిల్లాలో అన్ని వర్గాల ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందించాల్సిన వైద్య ఆరోగ్య శాఖలో.. వాటాల వ్యవహారం రచ్చరచ్చగా తయారైంది. వైద్య సేవలను పక్కనపెట్టి కేవలం పనులకు తగ్గట్టుగా 'వసూళ్లు.. వాటాలే..' ప్రధానమన్న రీతిలో కొందరు వ్యవహరించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ శాఖలో అవినీతి అక్రమాలు పెచ్చుమీరుతుండటం గమనార్హం. డెమో విభాగం, పరిపాలన విభాగం నుంచి చేస్తున్న కలెక్షన్లు అన్నీ కీలకాధికారికి పెద్ద వాటాగా వారాంతంలో జేబులోకి చేరేలా ఈ అధికారిక దళారీలు పనిచేస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రతి పనికీ ఒక్కో రేటు..!

జిల్లా వైద్యారోగ్య శాఖకు చెందిన అనేక అంశాలతో పాటు మార్కెట్‌లో ఎన్నో వ్యాపారాలకు ప్రత్యక్షంగా డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. ముఖ్యంగా ప్రైవేటు ఆస్పత్రుల రిజిస్ట్రేషన్లు, అనుమతులు పొడిగింపు, వివిధ రకాల వైద్య పరీక్షల ల్యాబ్‌ల ఏర్పాట్లు, స్కానింగ్ సెంటర్లు రిజిస్ట్రేషన్లు అనుమతులతో పాటు పౌల్ట్రీ ఫారం, గ్యాస్ గొడౌన్లు, పెట్రోల్ బంకుల ఏర్పాటుకు నో అబ్జక్షన్ సర్టిఫికెట్లు (ఎన్‌వోసి), ప్రైవేటు పాఠశాలలకు శానిటేషన్ సర్టిఫికేట్లు, ఇలాంటి అనుమతులను డీఎంహెచ్‌ఓ కార్యాలయమే అనుమతి పత్రాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇక విధుల్లో భాగంగా చేయాల్సిన సర్వీస్ రెగ్యులరైజేషన్లు, సర్వీస్ మేటర్లు, మెడికల్ లీవ్‌లు, మెటర్నటీ లీవ్స్, స్పెషల్ గ్రేడ్లు కేటాయింపు తదితర పరిపాలనాంశాలకు ఒక్కో రేటు ఫిక్స్ చేశారు. వీటికి గాను గరిష్టంగా రూ.50 వేల వరకు వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల పీహెచ్‌సీ వైద్యులకు అదే స్థాయిలో ఉండే ఓ మోనటరింగ్ విభాగ అధికారి జూమ్ మీటింగ్ ఏర్పాటు చేసి కలెక్షన్లకు సిద్ధమవ్వాలంటూ హుకుం జారీ చేశారంటే పరిస్థితి ఎంతవరకు వచ్చిందో స్పష్టమవుతోంది. ఇక కీలకమైన మాస్ మీడియా సెక్షన్ పరిధిలో ఉన్న జిల్లాలో ఉన్న సుమారు 310 వరకు స్కానింగ్ సెంటర్లు, 3 వేలకు పైగా ఉన్న ల్యాబ్‌ల రెన్యువల్స్‌తో పాటు కొత్త రిజిస్ట్రేషన్లు, అనుమ తిచ్చేందుకు గాను రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు వసూళ్లు మొదలుపెట్టేశారు. ఇందుకోసం కీలక అధికారి పేరిట మూడు వాటాలుగా కలెక్షన్లు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇదంతా డీఎంహెచ్‌వోకు తెలిసే జరుగుతుందనే ప్రచారం బయటకురావడంతో జిల్లా వ్యాప్తంగా ఈ వాటాల వ్యవహారం చర్చనీయాంశమైంది. జిల్లాకు కొత్తగా వచ్చిన ఆయనకు స్థానిక జిల్లాకు చెందిన ఉద్యోగుల్లో ఎవరేంటో తెలియకపోవడంతోనే సమస్య వచ్చిపడిందంటూ ఉద్యోగుల్లోనే చర్చసాగుతోంది. ఇదిలావుంటే నిన్నమొన్నటివరకు డీఎంహెచ్‌వోగా పనిచేసిన ఓ అధికారిణి ప్రాక్టీస్ చేసిన ఆసుపత్రి నుంచి కూడా ఇప్పుడు కలెక్షన్లు రావాల్సిందే అని దళారీ అధికార బృందం పట్టుపట్టడం గమనార్హం.

విచారణలోకి ఫేక్ సర్టిఫికెట్ల వ్యవహారం..

జిల్లా వైద్యారోగ్య శాఖలో డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీఈవో) పోస్టు ఇస్తున్నట్లుగా కొందరు నిరుద్యోగులకు ఫేక్ సర్టిఫికెట్లను జారీ చేసిన ఉదంతం నాలుగు నెలల క్రితమే బయటకొచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే బాధితుల ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులు సైతం విచారణకు ఆదేశించడం.. ఇటీవలే డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ సమక్షంలోనే విచారణాధికారిగా విశాఖపట్నం డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు స్వయంగా విచారణ ప్రక్రియ చేపట్టారు. ఈ వ్యవహారంలో బాధితులిచ్చిన ఫిర్యాదు ప్రకారం అనుమానితులుగా ఉన్న సూపరింటెండెంట్ భాస్కరకుమార్, కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ జి.వి.నరసింహంలపై చర్యలకు దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందులోనుంచి ఎలాగైనా శాఖాపరమైన చర్యల నుంచి తప్పించుకునేందుకు కొత్తగా దళారీ వ్యవస్థ రంగంలోకి దిగింది. వారిద్దరికీ సహకరించేలా స్థానికంగా శాఖకు చెందిన కీలక అధికారి జేబు నింపేందుకు దళారీ వ్యవహారం సిద్ధమైంది. దీంతో ఈ విచారణ పక్కదారి పట్టే అవకాశాలున్నట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలావుంటే ఈ ఫేక్ సర్టిఫికెట్ల వ్యవహారంపై జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పిరియా విజయ కూడా సమావేశంలో ఇటీవల ప్రస్తావించి.. అనుమానితులపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించిన సంగతి విదితమే. ఏదిఏమైనా వైద్యారోగ్యశాఖలో జరుగుతున్న వరుస అక్రమాలు, అక్రమ వసూళ్ల వ్యవహారం కూటమి ప్రభుత్వం వచ్చాక శృతిమించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టీచర్లకు వెబ్ ఆధారిత బదిలీలు వద్దు

- మాన్యువల్‌గానే నిర్వహించాలి
- ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ



చర్చా వేదికలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ

శ్రీకాకుళం న్యూకాలనీ: వెబ్ కౌన్సిలింగ్, వెబ్ ఆధారిత బదిలీల పట్ల తమకు నమ్మకం లేదని, మాన్యువల్ విధానంలోనే కౌన్సిలింగ్ నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని దాసరి క్రాంతిభవన్‌లో మంగళవారం ఉపాధ్యాయ బదిలీల చట్టం డ్రాఫ్ట్‌పై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాన్యువల్ విధానమే కావాలంటూ రాష్ట్రంలో లక్షలాది మంది ఉపాధ్యాయులు గగ్గోలు పెడుతున్నా విద్యాశాఖ ఉన్నతాధికారులు తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకపోవడం సరికాదన్నారు. తాజాగా విడుదల చేసిన డ్రాఫ్ట్‌లో సైతం వెబ్ ఆధారిత కౌన్సిలింగ్ విధానమే ఉంటుందని ఉన్నతాధికారులు తెలియజేయడాన్ని ఎస్టీయూ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెబ్ కౌన్సిలింగ్‌లో వేలాది ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుందని.. సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులైతే.. ఒక జిల్లాలో 3,500 నుంచి 5వేల సంఖ్య వరకు సీనియారిటీ లిస్టు ఉంటుందన్నారు. అందులో చివర ఉన్న వ్యక్తులు 4వేల వరకూ పాఠశాలకు ఆప్షన్స్ ఇవ్వడం దాదాపు అసాధ్యమని, ఇదెంతో తీవ్రమైన ఒత్తిడితో కూడిన అంశం కాదా ? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో దాదాపు 98 వేల మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు వెబ్ కౌన్సలింగ్ వద్దని మొరపెట్టుకుంటున్నా వినిపించుకోకుండా విద్యాశాఖాధికారులు ఎవరి ప్రయోజనాలు కోసం వెబ్ కౌన్సలింగ్‌లో బదిలీలు చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కూటమినేతలు, విద్యాశాఖ మంత్రి కలుగజేసుకొని ఉన్నతాధికారులు ఒంటెద్దు పోకడలను నిలువరించకపోతే భవిష్యత్తులో మూల్యం చెల్లించకతప్పదని స్పష్టం చేశారు. అనంతరం మండలాల నాయకులు, పలువురు ఉపాధ్యాయులు డ్రాఫ్ట్ చట్టంపై ఉన్న అభ్యంతరాలను ప్రొఫార్మాలో నింపి పాఠశాల విద్యాశాఖకు మెయిల్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, కె.శ్రీనివాసరావు, జి.శ్రీను, ఎం.తేజ, చింతల రామారావు, చౌదరి జగన్ తదితరులు పాల్గొన్నారు.

పాల వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రమేష్‌బాబు

మదన్ జెన్నా(ఫైల్)

మెళియాపుట్టి: నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మెళియాపుట్టి మండలకేంద్రంలో మంగళవారం వేకువజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా భిన్నాళ గ్రామానికి చెందిన మదన్ జెన్నా (52) ప్రతి రోజు మెళియాపుట్టి వచ్చి కూరలు అమ్ముతుంటాడు. ఎప్పటిలాగే మంగళవారం వేకువజామున 3 గంటల ప్రాంతంలో గ్రామానికి చెందిన బిసక్ ప్రధాన్‌తో కలిసి మెళియాపుట్టి బయలుదేరాడు. బిసక్ ప్రధాన్ వ్యక్తిగత పనిపై ఓ చోట ఆగిపోయారు. మదన్ జెన్నా నడుచుకుని వెళ్తుండగా మూడురోడ్ల కూడలి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆపకుండా వెళ్లిపోయింది. తలకు బలమైన గాయం కావడంతో మదన్ అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడి సీసీ కెమెరాలు పరిశీలించగా పాలవ్యాన్ ఈ ప్రమాదానికి కారణమని గుర్తించారు. అనంతరం డ్రైవర్ బొడ్డేపల్లి రోహిత్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. ఎస్సై రమేష్‌బాబు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మదన్‌కు భార్య పుల్లో జెన్నా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సిరిమాను సంబరం



సిరిమానుపై ప్రధాన పూజారి

గార మండలం పూసర్లపాడు గ్రామదేవత అసిరితల్లి సిరిమానోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. నాలుగు దశాబ్దాల తరువాత నిర్వహిస్తున్న వేడుక కావడంతో భక్తులు పోటెత్తారు. మధ్యాహ్నం తల్లి ఘటం ముందుగా బయలుదేరగా అనంతరం సిరిమాను బయలుదేరింది. ప్రధాన పూజారి మాను చివరన కూర్చోగా ఘటాల ఊరేగింపు తోడుగా భక్తులు బయలుదేరారు. అమ్మవారికి అభిషేకాలతో నైవేద్యాలు సమర్పించారు. హైకోర్టు న్యాయమూర్తి పర్లాడ రాజశేఖరరావు అమ్మవారిని దర్శించుకున్నారు. సీఐ పైడపునాయుడు, ఎస్ఐ ఆర్.జనార్దనరావు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

– గార



ఘటాలతో బయలుదేరిన పూసర్లపాడు గ్రామస్తులు

ఆలయంలో చోరీ

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కొండమ్మతల్లి ఆలయంలో సోమవారం రాత్రి దొంగలు పడ్డారు. హుండీని దొంగలు పగలుగొట్టి నగదు పట్టుకుపోయారు. అక్కడి వస్తువులన్నీ చిందరవందరగా పడేశారు. స్థానికులు మంగళవారం ఉదయం పూజలు నిమిత్తం ఆలయానికి చేరుకుని పరిశీలించగా చోరీ జరిగిందని గుర్తించారు. అనంతరం కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించగా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ పోలీసులు తెలిపారు.

గ్రామ సచివాలయ సర్వేయర్ల ధర్నా

- పనిభారం తగ్గించాలని డిమాండ్
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



కలెక్టర్ వినతిపత్రం అందజేస్తున్న గ్రామ సర్వేయర్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్రామ సచివాలయం సర్వేయర్లపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేస్తు గ్రామ సచివాలయం సర్వేయర్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం సర్వేయర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బూరాడ మధు బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక సర్వేయర్లపై పనిభారం, ఒత్తిడి, వేధింపులు ఎక్కువయ్యాయని చెప్పారు. క్షేత్రస్థాయి సమస్యలు తెలుసుకోకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రోసీజర్ (ఎస్ఓపీ) ప్రకారం పనిచేయాలంటూ ఒత్తిడి తీసుకొస్తున్నారని, వీఆర్వోల పని కూడా తమతో చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా 28 మండలాల్లో రీ సర్వే జరుగుతోందని, ఆ పనులు పూర్తి కాకముందే మండలానికి రెండు గ్రామాలు వంతునా అదనంగా మరో 56 గ్రామాలు రీ-సర్వే చేయాలని ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు. కొత్త పరికరాలు ఇవ్వకపోవడంతో సర్వే చేయడం కష్టంగా మారిందన్నారు. గతంలో క్షేత్రస్థాయిలో ఉన్నప్పుడు బయోమెట్రిక్ హాజరు వెసులుబాటు ఉండేదని, కొత్త ప్రభుత్వం వచ్చాక కచ్చితంగా కార్యాలయంలోనే హాజరువేయాలని నిబంధనలు విధించడం సరికాదన్నారు. సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధనకు ఈ నెల 9న విజయవాడలో పెద్ద ఎత్తున ర్యాలీ, నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు జగదీష్, కార్యదర్శి లోకేష్, రాష్ట్ర కో-ఆర్డినేటర్ మజ్జి అయ్యప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు



సంగాంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వంగర: మండల పరిధిలో సంగాంలో వెలిసిన పవిత్ర సంగమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఏడు రోజుల పాటు జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాది మంది భ భక్తులు సువర్ణముఖి, వేగావతి, నాగావళి నదులు కలిసే త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి సంగమేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

పీటీసీలో న్యాయశాస్త్రంపై విద్యార్థులకు శిక్షణ

విజయనగరం క్రైమ్: స్థానిక కంటోన్మెంట్ పోలీస్ శిక్షణ కళాశాలలో న్యూక్రిమినల్ లాస్‌పై అన్న అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రెండు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని పీటీసీ ప్రిన్సిపాల్ టి.రామచంద్రరాజు మంగళవారం ప్రారంభించారు. క్రిమినల్ ప్రొసీజర్, ఎవిడెన్స్ యాక్ట్, ఇంటరాగేషన్ టెక్నిక్స్ తదితర అంశాలపై పీటీసీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం ప్రిన్సిపాల్ చేతుల మీదుగా స్టూడెంట్స్‌కు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.వి.అప్పారావు, డీఎస్పీ శ్రీకాంత్, డీఎస్పీ రమేష్, పలువురు సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ట్రైబల్ వెల్ఫేర్ పనులు పరిశీలించిన విజిలెన్స్ ఎస్పీ

పాచిపెంట: మండలంలోని గురివినాయుడుపేట వద్ద ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్మాణమవుతున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను శ్రీకాకుళం విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు పరిశీలించారు. ఈ మేరకు మంగళవారం ఆయన పాఠశాల భవన నిర్మాణాన్ని పరిశీలించి పనుల ప్రగతిపై ఆరా తీశారు. ఆమోదం పొందిన ప్లాన్ ప్రకారం నిర్మాణం జరుగుతున్నదీ..లేనిదీ తనిఖీచేస్తున్నామని, నాణ్యత పరీక్షలు చేసిన తరువాత ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఈఈ మణిరాజ్, డీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్‌పై బురద జల్లడం తగదు



యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు

పార్వతీపురంటౌన్: ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి ఓటమిని అంగీకరించకుండా యూటీఎఫ్‌పై బురద జల్లడం మానుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహనరావు మంత్రి అచ్చెంనాయుడికి సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలను రాజకీయం చేసి, కూటమి అభ్యర్థి ఓడిపోయిన తరువాత, గెలిచిన వారేే మా అభ్యర్థి అనడం..అక్కడితో ఆగకుండా యూటీఎఫ్ ముసుగులో వైఎస్సార్‌సీపీ పోటీచేసిందనడం వారి రాజకీయ క్రీడలను సంఘాలకు ఆపాదించడం సరికాదన్నారు. ప్రభుత్వం ఏదైనా గానీ ఉపాధ్యాయులకు, విద్యారంగానికి వ్యతిరేకంగా నిర్ణయాలు చేస్తే నిలదీసే తత్వం ఉన్న సంఘం కాబట్టే సుమారు 6వేల ఓట్లు వచ్చాయన్నారు. భవిష్యత్‌లో నైనా ఇటువంటి చౌకబారు ఆరోపణలు మానుకోవాలని ఆయన హితవు పలికారు.

బైక్‌పైనుంచి జారిపడి యువకుడి మృతి



బంగారునాయుడు మృతదేహం

చీపురుపల్లి: పట్టణంలోని ఆంజనేయపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కుడుముల బంగారునాయుడు(32) అనే యువకుడు మృతిచెందాడు. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి హెచ్‌సీ రమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరివిడి మండలంలోని రేగటి గ్రామానికి చెందిన కుడుమల బంగారు నాయుడు, శనపతి రాము కలిసి ద్విచక్ర వాహనంపై చీపురుపల్లిలోని అమ్మవారి జాతరకు వచ్చారు. తిరిగి తమ గ్రామానికి వెళ్తుండగా వాహనం నడుపుతున్న శనపతి రాము ఆంజనేయపురంలో సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక కూర్చున్న బంగారునాయుడు ద్విచక్ర వాహనం నుంచి కింద పడిపోగా తలకు బలమైన గాయమైంది. దీంతో తక్షణమే సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎందుకంత ప్రేమంట..!

- ఒకే ఊరికి 30 గోకులాలు మంజూరు




గంగచోళ్లపెంట గ్రామ లేఅవుట్‌లో నిర్మాణం చేసిన గోకులం

గోకులాల నిర్మాణానికి ఎంతెంత?	
రెండు ఆవులు ఉంటే..	రూ.1లక్షా30వేలు
నాలుగు ఆవులకు	రూ.1లక్షా80వేలు
ఆరు ఆవులకు	రూ.2లక్షల 30వేలు

ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 90శాతం రైతులకు నిధులు ఇవ్వగా పది శాతం మాత్రమే రైతులు పెట్టుకోవాలి

గజపతినగరం రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని పశువులను కమ్మలతో కూడిన శాలల్లో ఉంచడం వల్ల అప్పుడప్పుడు అనారోగ్యం పాలవుతున్నాయి. తగిన సదుపాయాలు లేక ఆరోగ్యం పాడై మృత్యువాత పడుతున్నాయి. ఈ సందర్భాలను రాష్ట్ర ప్రభుత్వం గమనించి, ఆసక్తి ఉన్న రైతులకు మినీ గోకులాల నిర్మాణం చేపట్టుకునేందుకు అవకాశం కల్పించింది. ప్రభుత్వం 90శాతం నిధులు మంజూరుచేస్తే స్థానిక రైతులు పదిశాతం మాత్రమే పెట్టుబడి పెట్టి మినీ గోకులాల నిర్మాణం చేసుకోవచ్చంటూ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో తెలుగు తమ్ముళ్లు తమ గ్రామాల్లో ఆధిపత్యం చెలాయించడం కోసం మినీ గోకులాలు అధికంగా కావాలని నాయకుల వద్దకు సిఫార్సులతో వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో గజపతినగరం మండలంలోని లోగిశ గ్రామ రైతులకు మండలంలో ఏగ్రామానికి లేనంతగా 30గోకులాలు అధికార పార్టీ నేతలు మంజూరు చేయించారు. అయితే దీని



లోగిశ గ్రామంలో పూర్తయిన గోకులం

వెనుక అదే గ్రామానికి చెందిన మాజీ మండల ప్రజాప్రతినిధి అభీష్టం మేరకు స్థానిక మంత్రి జిల్లా స్థాయి అధికారులతో మాట్లాడి 30 గోకులాలు మంజూరుచేయించినట్లు సమాచారం. జిల్లాలో ఒక్కో మండలానికి తొలిదశలో 75 గోకులాలు మంజూరైతే ఒక్క గజపతినగరం మండలానికి ఏకంగా 135 గోకులాలు మంజూరు చేశారు. ఇందులో ఒక్క లోగిశ గ్రామానికే 30గోకులాలు మంజూరు చేయడంపై సంబంధిత మాజీ ప్రజాప్రతినిధిపై స్థానిక మంత్రికి కాస్త ప్రేమ ఎక్కువగానే ఉన్నట్లు ఉందని కూటమి ప్రభుత్వానికి చెందిన స్థానిక నాయకులే గుసగుసలాడుకుంటున్నారు. ఇంతకీ 30 గోకులాలు మంజూరైనప్పటికీ అందులో కేవలం ఏడు గోకులాలు మాత్రమే నిర్మాణం పూర్తిచేసుకున్నట్లు సమాచారం. మిగిలిన 23 మంది రైతులు ముందు తాము పెట్టుబడి పెడితే ఆనక బిల్లులు మంజూరు కావడంలో ఆలస్యమైతే ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుందని గోకులాల నిర్మాణానికి ముందుకు రానట్లు సమాచారం.

బ్యాంకులో బంగారం పెట్టి గోకులం కట్టాను



మినీ గోకులం నిర్మాణానికి రూ.1లక్షా 30వేలు ఖర్చుచేశాను. గోకులం నిర్మాణం పూర్తయినా ఒక్క రూపాయి కూడా బిల్లు ఇవ్వలేదు.నా భార్య బంగారం బ్యాంకులో తాకట్టుపెట్టి నిర్మాణం చేశాను. బిల్లు కోసం ఎదురు చూస్తున్నాను.

– లోగిశ సూరప్పుడు, లోగిశ గ్రామం

నిధులు రాలేదు



నిర్మాణాలు పూర్తయిన గోకులాలన్నింటికి బిల్లులు అప్‌లోడ్ చేసి ఉంచాం. నిధులు రాగానే బిల్లులు చెల్లింపు చేస్తాం. ఇప్పటివరకూ మండలానికి 135 గోకులాలు మంజూరు కాగా 80 గోకులాల నిర్మాణం పూర్తయింది. లోగిశ గ్రామానికి మంజూరైన 30 గోకులాలు స్థానిక మంత్రి జిల్లా స్థాయి అధికారులతో మాట్లాడి మంజూరు చేయించారు.

– కల్యాణి, ఎంపీడీఓ, గజపతినగరం మండలం

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక పుష్పాలంకరణలో అమ్మవారు



దర్శించుకుంటున్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు, పెద్దలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఘటాలను సమర్పించారు. కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కెఎన్‌వీడీపీ .ప్రసాద్ పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా యువత ప్రతిభ

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజయనగరం యువత సత్తా చాటారు. ఈనెల 1,2 తేదీల్లో విశాఖ జిల్లా గాజువాకలో జరిగిన పోటీల్లో నగరంలోని బాడీ ఫిట్‌నెస్ జిమ్‌లో శిక్షణ పొందుతున్న కె.జగదీష్ 56 కేజీల బెంచ్ ప్రెస్ విభాగంలో 87.5 కేజీల బరువు ఎత్తి బంగారు పతకం, డెడ్‌లిఫ్ట్‌లో 195 కేజీల బరువు ఎత్తి మరో బంగారు పతకం దక్కించుకున్నాడు. అంతేకాకుండా సీనియర్ కేటగిరీ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జగదీష్ స్ట్రాంగ్ మెన్ టైటిల్ కైవసం చేసుకోవడం విశేషం. ఇదే పోటీల్లో 66 కేజీల విభాగంలో విజయనగరం నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎ.రాజా డెడ్‌లిఫ్ట్‌లో 205 కేజీల బరువు ఎత్తి బంగారు పతకం సాధించగా..74 కేజీల విభాగంలో ఎం.వెంకటేష్ బెంచ్ ప్రెస్‌లో 90 కేజీల బరువు ఎత్తి కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను బాడీ ఫిట్‌నెస్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి శంకరరావు, ప్రధాన కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావులు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించి జిల్లా కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పాలని ఆకాంక్షించారు.



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

ఇంటర్ ఫస్ట్‌ఇయర్ పరీక్షకు 562 మంది గైర్హాజరు

- డీవీఈఓ మంజుల వీణ



పరీక్షలు రాసేందుకుకు సిద్ధమవుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 562మంది గైర్హాజరైనట్లు డీవీఈఓ మంజుల వీణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె పట్టణంలోని పలు పరీక్షాకేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 34 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9437 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 8875మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. పరీక్షల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, మాస్‌కాపీయింగ్ జరగకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. సిటింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్, బల్క్‌మెంబర్లు పరీక్షలను పర్యవేక్షించారన్నారు. పరీక్షలన్నీ నిత్యం సీసీ కెమెరాల లైవ్‌స్ట్రీమింగ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎటువంటి మాస్‌కాపీయింగ్ నమోదు కాలేదని స్పష్టం చేశారు.

ఎల్లమ్మ గుడిలో హుండీని విరగ్గొట్టిన దుండగులు



దుండగులు విరగ్గొట్టిన హుండీ

గంట్యాడ: మండలంలోని నరవ గ్రామంలో ఉన్న ఎల్లమ్మ గుడిలో హుండీని సోమవారం రాత్రి దుండగులు విరగ్గొట్టారు. అందులో ఉన్న డబ్బులను దొంగిలించారు. అయితే ఈవిషయంపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

డ్రోన్ సహాయంతో జూదరుల అరెస్టు

పార్వతీపురం రూరల్: పట్టణంలోని బూరాడ వీధిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.1560లు నగదును స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ ఎస్సై ఎం.గోవింద తెలిపారు. మంగళవారం పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలు నిరోధించేందుకు డ్రోన్ కెమెరాను వినియోగించిన సందర్భంలో పేకాట ఆడుతున్న దృశ్యాన్ని గుర్తించి పేకాట శిబిరం వద్దకు వెళ్లి జూదరులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఎడ్ల పరుగు పోటీల్లో వావిలపాడు విజేత



ప్రదర్శనలో పరుగు తీస్తున్న ఎడ్లు

వేపాడ: మండలంలోని పాటూరు సమీపంలో గాడివారి కళ్లాల వద్ద మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శనలో వావిలపాడుకు చెందిన ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. కళ్లాల వద్ద అభయాంజనేయ స్వామి తీర్థమహోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలో 12 ఎడ్లు జతలు పాల్గొన్నాయి. వాటిలో రెండోస్థానంలో వల్లంపూడికి చెందిన ఏడువాక సత్తిబాబు ఎడ్లు, మూడో స్థానంలో తుమ్మికాపల్లికి చెందిన జైదర్శిని ఎడ్లు, నాల్గో స్థానంలో కృష్ణారాయుడుపేటకు చెందిన గుమ్మాలమ్మ తల్లి ఎడ్లు, ఐదోస్థానంలో కలగాడకు చెందిన ఎడ్లు, ఆరోస్థానంలో వావిలపాడుకు చెందిన గండి వెంకటరావు ఎడ్లు నిలిచాయి. విజేతలకు రూ.12వేలు,10వేలు, 8వేలు, 6వేలు, 4 వేలు చొప్పున నగదు బహుమతులను గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ, దాతలు అందజేశారు. స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్న అన్నసమారాధన చేశారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు



వైద్యసిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

పాలకొండ రూరల్: గ్రామస్థాయిలో పీహెచ్‌సీల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి ఎస్.భాస్కరరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పాలకొండ మండలంలోని అన్నవరం, ఎం.సింగుపురం పీహెచ్‌సీలను సందర్శించి అక్కడి డ్రగ్‌స్టోర్, ల్యాబ్ లతో పాటు రోజువారీ ఓపీ రిజిస్టర్లు పరిశీలించారు. ఈ క్రమంలో మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తాజా స్థితిగతులను తెలుసుకున్నారు. ప్రైవేట్ వైద్య కేంద్రాలను సందర్శించిన ఆయన అక్కడి వసతుల గురించి రోగుల దగ్గర ఆరా తీశారు. ప్రభుత్వ వైద్యులు సమయపాలన పాటించాలని, క్షేత్రస్థాయి వైద్యసిబ్బంది గ్రామాల్లో సంచరిస్తూ రోజువారీ నివేదికలు అందించాలని ఆదేశించారు. ప్రస్తుత సీజన్‌లో విజృంభించే వ్యాధులు, వాటిని అధిగమించేందుకు అవలంబించాల్సిన రోగ నిరోధక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట యోగేశ్వరరెడ్డి, సన్యాసిరావు, డీఎస్‌ఓ శంకరరావు, వైద్యాధికారులు తేజరత్న రాజ్, వెన్నెల, రవికుమార్, అనిల్‌కుమార్ తదితరులున్నారు.

మనోవేదనతో వ్యక్తి మృతి



మృతుడు కొరువాడ శ్రీనివాసరావు (ఫైల్)

శృంగవరపుకోట: పట్టణంలోని పుణ్యగిరి రోడ్డులో నివాసం ఉంటున్న వ్యక్తి మనోవేదనతో మృతిచెందాడు. ఈ ఘటనపై ఇరుగుపొరుగు వారు, పోలీసులు ప్రాథమికంగా సేకరించిన వివరాలిలా ఉన్నాయి. నాయీబ్రాహ్మణ కులానికి చెందిన కొరువాడ శ్రీనివాసరావు(43) పట్టణంలోని పుణ్యగిరి రోడ్డులో నివాసం ఉంటున్నాడు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. వేర్వేరు వ్యాపారాల్లో నష్టాలపాలైన శ్రీనివాసరావు కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యానికి బానిసైన శ్రీనివాసరావు భార్యతో గొడవపడి విడాకుల వరకూ వెళ్లాడు. కోర్టులో వారి విడాకుల కేసు నడుస్తుండడంతో శ్రీనివాసరావు భార్య కుమార్తెతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయి అక్కడే ఉంటోంది. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావు కొంత కాలంగా తన ఇంటి మేడ మీది గదిలో ఒంటరిగా ఉంటున్నాడు. మూడు రోజులుగా శ్రీనివాసరావు కనిపించలేదని, బయటకు రాలేదని కింది పోర్షన్‌లో ఉన్న వారు స్థానికులకు చెప్పడంతో వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఇంటికొచ్చి తలుపులు తెరిచి, చూడగా శ్రీనివాసరావు చనిపోయి మంచంపై పడి ఉన్నాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మా..కరుణించమ్మా

- అనుబంధ అమ్మవార్ల దర్శనానికి పోటెత్తిన భక్తులు
- పసుపు, కుంకుమలతో మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- కోటదుర్గమ్మ, సంతానలక్ష్మి, అసిరితల్లి, భాగిరేతమ్మ ఆలయాల్లో సందడి



అమ్మవారి దర్శనానికి పట్టు వస్త్రాలతో వస్తున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, డా.బొత్స సందీప్

చీపురుపల్లి: భక్తుల కష్టాల్లో తోడుంటూ ఆదుకునే అమ్మా కరుణించండి అంటూ పట్టణంలోని అనుబంధ అమ్మవార్లను భక్తులు వేడుకున్నారు. పసుపు, కుంకుమలతో అమ్మవార్లకు మొక్కులు సమర్పించుకున్నారు. తమ కష్టాలు తొలగించండి తల్లీ అంటూ చీరలు చూపిస్తూ అమ్మవార్లకు భక్తి, శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దీంతో పట్టణంలో అనుబంధ అమ్మవార్లుగా చెప్పుకునే శ్రీ కోటదుర్గమ్మ, శ్రీ సంతానలక్ష్మి, శ్రీ అసిరితల్లి, శ్రీ భాగిరేతమ్మ ఆలయాల్లో భక్తుల సందడితో పాటు ఆధ్యాత్మిక వాతావరణ నెలకొంది. సంప్రదాయం ప్రకారం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి అక్క, చెల్లెళ్లుగా చెప్పుకునే అనుబంధ అమ్మవార్లుగా పట్టణంలో ఉన్న శ్రీ కోటదుర్గమ్మ, శ్రీ సంతోషిమాత, శ్రీ అసిరితల్లి, శ్రీ భాగిరేతమ్మ అమ్మవార్లకు కనక మహాలక్ష్మి జాతర ఉత్సవాల్లో ఆఖరి రోజు భక్తులు ప్రత్యేక పూజలతో బాటు మొక్కులు సమర్పించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే మంగళవారం పట్టణంలోని శ్రీ కోటదుర్గమ్మ, సంతానలక్ష్మి, అసిరితల్లి, భాగిరేతమ్మ అమ్మవార్ల ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. మంగళవారం తెల్లవారుజామున 5 గంటల నుంచే అమ్మవార్ల దర్శనానికి భక్తులు క్యూలో బారులు తీరారు. శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని వేడుకున్న మాదిరిగానే పసుపు, కుంకుమలతో పాటు చీరలు మొక్కుతూ తమ కష్టాలు నెరవేర్చాలని అనుబంధ అమ్మవార్లను వేడుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని కొత్తగవిడివీధిలో గల శ్రీ కోటదుర్గమ్మ వారి ఆలయంలో భక్తులు అమ్మవారికి మొక్కులు సమర్పించుకుంటూనే వేపచెట్టు వద్ద పూజలు చేశారు. అలాగే శ్రీ సంతోషిమాత, భాగిరేతమ్మ, అసిరితల్లి ఆలయాల వద్ద భక్తులు తులసి కోటకు పూజలు చేసి అమ్మవారిని వేడుకున్నారు. ఆలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలోని శ్రీ కోటదుర్గమ్మ వారి ఆలయం వద్ద దర్శనానికి వచ్చే భక్తుల కోసం సిటీకేబుల్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని పలువురు ప్రముఖులు మంగళవారం దర్శించుకున్నారు. శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆఖరిరోజు మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, కుమారుడు డా.బొత్స సందీప్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, డా.బొత్స సందీప్‌లు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలు నాయుడు, బెల్లాన వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు



కోటదుర్గమ్మ దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



సంతానలక్ష్మి ఆలయం వద్ద భక్తుల సందడి

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పార్వతీపురం టౌన్: గరుగుబిల్లి మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన నాగళ్ల సింహాచలం(55) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు, ఈ ఘటనపై పార్వతీపురం జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులు మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం కళ్లికోట గ్రామానికి చెందిన గౌరీ శంకరరావు దగ్గర గొర్రెల కాపరిగా సింహాచలం పనిచేస్తున్నాడు. సింహాచలం కుమారుడు విశాఖపట్నంలో పనిచేస్తున్నాడు. కుమారుడికి ఎన్ని మార్లు ఫోన్ చేసినా స్పందన లేకకోవడంతో మనస్తాపం చెంది సోమవారం సాయంత్రం గుమడ గ్రామ సమీపంలో ఉన్న ఇటుకబట్టీల వద్దకు వెళ్లి పురుగు మందు తాగేశాడు. గమనించిన యజమాని గౌరీశంకరరావు వెంటనే తన మోటార్ సైకిల్‌పై పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తీసుకు రావడంతో వైద్యులు చికిత్స అందజేస్తుండగా మంగళవారం ఉదయం మృతిచెందాడు. గరుగుబిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అవుట్‌పోస్టు ఏఎస్సై నిమ్మకాయల భాస్కరరావు తెలిపారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు ఈగల్ టీమ్స్

విజయనగరం క్రైమ్: మాదక ద్రవ్యాల నిర్మూలనకు అన్ని విద్యా సంస్థల్లోనూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈగల్ టీమ్స్‌ను ఏర్పాటుచేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాలవల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్, కళాశాలలు, ఇంజినీరింగ్, మెడికల్, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో 'సంకల్పం' కింద డ్రగ్స్ వినియోగం, వాటివల్ల కలిగే దుష్ప్రభావాలను ప్రచారం చేయాలన్నారు. ప్రతిరోజూ ప్రార్థన నిర్వహించే సమయంలో ఉపాధ్యాయులు 10 నిమిషాలపాటు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించాలన్నారు. డీ అడిక్షన్ సెంటర్ పనిచేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారుచేసి అందజేయాలని కోరారు. డ్రగ్స్ నియంత్రణకు పోలీస్, డ్రగ్స్ విభాగం సంయుక్తంగా దాడులు నిర్వహించాలని ఆదేశించారు. ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా గంజాయిసాగు లేదన్నారు. ఏఎస్ఆర్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి గంజాయి రవాణా జరుగుతుందన్నారు. దీనిని కట్టడిచేసేందుకు ఐదు పోలీస్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. గంజాయి వ్యాపారంతో ఆస్తులు కూడబెట్టిన నిందితుడికి చెందిన రూ.1.96 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్‌చేశామన్నారు. ఇప్పటికే జిల్లాలో లక్షా 18 వేల మంది విద్యార్థులకు అవగాహన కల్పించామని తెలిపారు. పోలీస్ శాఖ చేపట్టిన కార్యక్రమాలు, ప్రగతిని ఎస్పీ వకుల్‌జిందల్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డీఆర్‌ఓ శ్రీనివాసరావు, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి, ఆర్డీఓలు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి..

సాలూరు: పట్టణంలోని దుర్గానవీధిలో నివాసముంటున్న షేక్ ఖలీల్ (29)ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఫిర్యాదు అందిందని సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ, సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో షేక్ ఖలీల్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నట్లు మృతుడి భార్య షేక్ భువనేశ్వరి ఫిర్యాదులో పేర్కొన్న మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పార్వతీపురం రూరల్: మండలంలోని పార్వతీపురం-నర్సిపురం రహదారి పరిధిలో ఈనెల 2న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన కొల్లి బాలాజీ (34) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ మేరకు మృతుడి భార్య రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.సంతోషి తెలిపారు.